स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत-उज्वल भविष्य Glorious Past-Brighter Future

# ఆకాశం నవ్వింది

తవ్వా ఓబుల్ రెడ్డి

''ఏమోయ్.. బాలసుబ్బడూ ఏందో ఎతుకులాడ్తా చేలో అడ్డంగా నడుచ్చాండవ్. బంగారేమైనా దొరుకుతదనా?'' కట్టవల్లో ఎండు కట్టెపుల్లలు ఏరుకుని చంకలో పెట్టుకుని ఇంటికి వస్తూ పరాచికంగా అన్నాడు చెన్నారెడ్డి.

''బంగారు యాడుంది మామా దొరకడానికి'' ఈ బాకీలతో ఎట్టా బతకలేకుండాము. చేలో అడ్డంగా నడుచ్చే ఏ తేలో పామో కరసనన్నా కరుచ్చదేమోనని'' చెన్నారెడ్డి పలకరింపునకు బాధగా స్పందించాడు బాలసుబ్బయ్య.

''సచ్చిపోతే.. బాకీలు తీరిపోతే పిల్లోల్ల కోసమైనా అందరమూ చావమూ.. అయ్యేం మాటల్లేవోయ్ నాయాలా. సచ్చి సాదిచ్చేదేముంది. కట్టమొచ్చినప్పుడే గట్టింగ నిలబడాల'' వారిస్తున్నట్టుగా అన్నాడు చెన్నారెడ్డి.

''లేకపోతే.. ఏం బతుకు మామా ఇది! ఈసారైనా వానలు పడి, చెరువు నిండుతది అనుకుంటే ఆ అయిపే లేదు. నారుకయ్య అప్పుడే ఎండిపోతాంది'' బాలసుబ్బయ్యలో నిర్వేదం తొంగిచూసింది.

'' ఎటోక్కట్ట బతకాల్సిందే. బట్ట కట్టాల్సిందే. తూర్పువీధిలో అప్పుడే సగం మంది పరస్తలం బోయిరి. టౌన్లో ఇటుక బట్టీల కాడనో, ఇళ్లు కట్టేకాడనో పనులుండయంట. వల లేనప్పుడు ఏదో ఒక దోవ చూసుకోవాల్సిందే గదా'' బతుకు దెరువు చూపుతున్నట్లుగా చెప్పాడు చెన్నారెడ్డి.

ఇద్దరూ ఒకరి వెనకాల ఒకరు గెనంపై ఊరి దిక్కు నడక ప్రారంభించారు.

బాలసుబ్బయ్యా.. చెన్నారెడ్డీ ఒకే వీధికి చెందినవారు. చేలు పక్కపక్కనే ఉండటంతో మంచికీ చెడ్డకూ కలిసి మాట్లాడుకుంటూ ఉంటారు.



వానలు పడితే చెరువుకింద తనకున్న ఎకరం పొతికలో వరిమడి పెట్టుకుంటే ఈసారైనా సంగటి గింజలు పండించుకోవచ్చుననేది బాలసుబ్బయ్య ఆశ. పక్కపొలంలోని సుబ్బారెడ్డి బోరునుంచి పైపులు వేసుకుని నారు పోసుకున్నాడు. నారు మొలకెత్తి వారం రోజులు కూడా కాలేదు. బోరులో నీళ్లు తగ్గాయి. సగం కయ్య పారిన తర్వాత పైపులో నీటి ప్రవాహం ఆగిపోయింది.

చేలో చీలిన నెర్రెలు చదరంగం మాదిరిగా కనిపిస్తున్నాయి.

''మూడేళ్లుగా పైరు రావడం లేదు. చినుకు పడలేదు. చెరువులో నీటి జాడలేదు. ఇంట్లో తిండిగింజలు లేవు'' పరిస్థితిని మననం చేసుకున్నాడు బాలసుబ్బయ్య.

''నాకు తెలియక అడుగుతా మామా. ఈ వానలు ఎందుకు పడలేదంటావ్?'' అమాయకంగా చెన్నారెడ్డిని అడిగాడు బాలసుబ్బయ్య.

''పాపాలు పెరిగినయ్. ఎవరి స్వార్థం వాళ్లు చూసుకోబట్టి'' వానలు పడకపోవడానికి సాధారణంగా అందరూ చెప్పే కారణం చెప్పాడు చెన్నారెడ్డి.

''అదిగాదు మామా! ఎండ దేవుడేమో ఎండాకాలమంతా ఎండ అదర సంపుతానే ఉండాడు. గాలిదేవుడు కూడా కొట్టాలమింద బోదపీసు లేసిపోయేట్టుగా గాలి ఈయబట్టె. ఆకాశంలో రాత్రిపూట ఎన్నెల కూడా పిండారబోసినట్లు ఇరగకాచ్చాండ్య. సుక్కలూ మినుకు మినుకు మంటా మెరుచ్చా ఉండ్య. ఈ వాన దేవునికి ఏమైందని?'' నిష్ఠూరంగా ప్రశ్నించాడు బాలసుబ్బయ్య.

బాలసుబ్బయ్య ప్రశ్నకు ఏం సమాధానం చెప్పాలో తోచలేదు చెన్నారెడ్డికి.

''ఏమైందో!'' అని ఆ తర్వాత మౌనం వహించాడు.

అప్పుడప్పుడే చీకటి పడుతోంది.

ఆకాశంలో పక్షులు గుంపులు, గుంపులుగా గూళ్లకు సాగిపోతున్నాయి.

ఇద్దరూ మౌనంగా నడుస్తున్నారు.

ఉన్నట్టుండి ఫెళ్లుమని శబ్దం...!

ఒకరి వెనుకాల ఒకరుగా నడుస్తున్న బాలసుబ్బయ్య, చెన్నారెడ్డీ, తటాలున నిలబడి శబ్దం వచ్చిన వైపు చూశారు. ఉత్తరదిక్కున జువ్విమాను బావి దగ్గర నుండీ వచ్చింది ఆ శబ్దం.

నల్లటి మేఘం భూమిని తాకినట్లుగా పెద్ద శబ్దంతో జువ్విమాను నేలకొరిగింది.

''చెన్నారెడ్డిమామా! జువ్విమానేమో పడింది మామా...'' గద్గద స్వరంతో అన్నాడు బాలసుబ్బయ్య.

''మాను దానికై అదే పడలేదోయ్ నాయాలా. నరికి పడగొట్టినారు'' చెప్పాడు చెన్నారెడ్డి.

అర్థం కానట్టుగా చెన్నారెడ్డివైపుచూసినాడు బాలసుబ్బయ్య.

''రాత్రి ఊళ్లోకి కొత మిషిన్ వాళ్లు జీపేసుకుని వచ్చినారు. వామిదొడ్లల్లో, చేలగట్లపైన బావుల కాడ ఉండే చెట్లను కొని, అడ్వాన్సులు కూడా ఇచ్చిపోయినారు. వాళ్ల మనుషులే ఇప్పుడు జువ్విమానును నరికేసినట్లున్నారు'' అసలు సంగతి చెప్పాడు చెన్నారెడ్డి.

దారిన పొయ్యేవాళ్లను చెట్టుకిందికి పిలిచి.. సంగటి పెట్టి ఆకలి తీర్చి పంపే తిరుపతయ్య చెట్టును నరికించాడంటే బాలసుబ్బయ్య నమ్మలేకున్నాడు.

''నరికించక ఏం చేచ్చాడు. పైర్లు జూచ్చమా పండకపాయ. అప్పులేమో పెరిగిపాయ. కొడుకును కాలేజీలో చేర్చాలంటే చేతిలో పైసా డబ్బు లేకపాయ. చెట్టూ, పుట్టా అన్నీ అమ్ముకోవాల్సిందే'' బాధగా చెప్పాడు చెన్నారెడ్డి.

ఊరు దగ్గరపడింది. చీకటి పూర్తిగా అలుముకుంది. ఎదురుగా ఏదో వాహనం లైట్లు వేసుకుని రావడాన్ని వాళ్లిద్దరూ గమనించారు. ఇద్దరూ రోడ్డుకు పక్కగా జరిగారు. లావు లావు కలప మొద్దులు వేసుకున్న లారీ భీకర శబ్దం చేస్తూ టౌను దిశగా సాగిపోయింది.

''కరువులు ఎందుకు వస్తున్నాయంటే ఇందుకే'' లారీని చూపుతూ అన్నాడు చెన్నారెడ్డి.

ఊర్లోకి చేరిన ఇద్దరూ ఎవరి ఇళ్లవైపు వాళ్లు అడుగులు వేశారు.

బాలసుబ్బయ్య, రామస్వామి గుడివద్దకు చేరుకోగానే పిల్లలందరూ బిలబిలమంటూ పుస్తకాలతో



स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत-उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

వీధిలోకి వచ్చారు. వాళ్లంతా ప్రైవేటు నుంచీ వస్తున్నారు.

బాలసుబ్బయ్యను చూడగానే కూతురూ, కొడుకూ పుస్తకాలతో పరిగెత్తుకుంటూ వచ్చారు.

పిల్లలను వెంటబెట్టుకుని ఇంటిదారిపట్టాడు.

''నారుకయ్య పారిందా?'' బాలసుబ్బయ్యను ఆతృతగా అడిగింది అతడి భార్య గురమ్మ.

''సగం కయ్యకూడా పారలేదు. కరెంటు రవ్వంతసేపు ఉండింది. అయితే ఏం లాభం? బోరులో నీళ్లు అడుక్కుపోయినట్లుండాయి. సగం కయ్య పారినాంక బురదనీళ్లు వచ్చి నిల్చిపోయినాయి'' చెప్పాడు బాలసుబ్బయ్య.

''వద్దంటే నారు పోసినావు. వానలు పడినాక పోసుకుందామని చెప్పినా ఇనకపోతివి. ఆ సుబ్బారెడ్డి ఇప్పుడే వచ్చిపోయినాడు, రేపటినుండీ నారు కయ్యకు మోటారు వేసేది లేదంట. వాళ్లకయ్యేలే పారడం లేదంట. కరెంటు రోజుకు నాలుగు గంటలుకూడా ఉండడం లేదంట'' ఆందోళనగా అంది గురమ్మ.

భార్య మాటలకు గొంతు తడారిపోయినట్లయింది బాలసుబ్బయ్యకు.

'' ఓట్లప్పుడు ఉచిత కరెంటు ఇచ్చామని, అదీ తొమ్మిది గంటలపాటు సెప్పినోళ్లు ఏమి సేచ్చాండరో..'' బాధగా అనుకున్నాడు.

''బాలసుబ్బిమామా.. ఓ బాలసుబ్బి మామా'' అంటూ బయటనుండి పిలుపు.

ఇంట్లోంచి వీధిలోకి తొంగిచూశాడు బాలసుబ్బయ్య.

తూర్పువీధి కిట్టన్న!

'' ఊళ్లో శానామంది పనులకు టౌనుకు పోతాండరు. మా వీధిలో ఒక పిట్టలేరు. మా అన్నోళ్లూ, మేముకూడా సోమవారం పయాణం అయి తాండం. నువ్వు వచ్చావో, రావోనని అడిగిపోదామని వచ్చినా...'' విషయం చెప్పాడు కిట్టన్న.

''మేమూ వచ్చాములే కిట్టన్నా. రాకుండా పెరకతినడానికి ఈడ ఏముంది'' కల్పించుకుంటూ అంది గురమ్మ.

మౌనంగా నిలబడ్డాడు బాలసుబ్బయ్య.

''బతకడానికి యాడికో ఒక చోటికి పోవాల్సిందే. చదువుకుంటున్న కొడుకు, కూతుర్లను కూడా వెంటబెట్టుకు పోవాల్సిందే'' మనసులో నిశ్చయించుకున్నాడు బాలసుబ్బయ్య.

పిల్లోళ్ల చదువులు దెబ్బతింటాయనే బాధ బాలసుబ్బయ్యను ఆవేదనకు గురిచేస్తోంది.

చీకటి పడింది.

అన్నాలు తిని అరుగులమీదికి చేరారు జనం.

వాళ్ల యవ్వారంలో కరువు తప్ప మరో అంశం చోటుచేసుకోవడం లేదు. కొంత సేపటికి బాలసుబ్బయ్య కూడా అక్కడికి చేరాడు. తన నారుకయ్య ఎండుతున్న విషయం ప్రస్తావించాడు బాలసుబ్బయ్య.

'' ఇప్పుడు కయ్యలే ఎండుతాండయ్. ఇంగ రొండు రోజులుంటే మనుషులమే ఎండిపోతమేమో'' అప్పుడే అక్కడికి చేరిన చెన్నారెడ్డి మాట కలిపాడు.

''మోడాలు నల్లంగ మేకపోతు కలాసాలు యాలగట్టినట్లు కమ్ముకుంటాండయ్. ఇంగనైనా ఆ వానదేవుడు ఒక చూపు సూచ్చే బతికిపోతం. ఆకాశం వైపు ఆశగా చూస్తూ అన్నాడు, అదే అరుగు మీద కూర్చుని ఉన్న బండోళ్ల గురవయ్య.

''రుతుపవనాలు బలంగా ఉండాయంట! రాయలసీమలో ఒక మోస్తరు వాన పడొచ్చునని, ఈపొద్దు పేపర్లో కూడా యేసినారు'' టౌన్‌లో మెకానిక్‌గా పనిచేస్తూ ఆ ఊరికి చుట్టపు చూపుగా వచ్చిన ఓ యువకుడు సమాచారం అందించాడు.

''పేపరులో రోజూ యేచ్చాండరు లేబ్బా. ఆ వాన వచ్చింది లేదూ, మనం బతికి సచ్చింది లేదు. నెల కిందట ఇట్టనే రుతుపవనాలా.. అయ్యేంటియో వచ్చినాయీ, వానలు పడతాయని రేడియోల్లో, టీవీల్లో సెప్పుల్యా. ఏదీ ఒక్క పదునన్నా కురిసింద్యా. పూతకొచ్చిన శెనిక్కాయ చేలు మాడి మస్సై పోతాండాయ్...'' చెన్నారెడ్డి వాతవరణ సూచనలపై అసహనం ప్రకటించాడు.

'' ఇంగ రెండు రోజులు పోతే తాగడానికి నీళ్లు దొరకవంట!'' అరుగుపై చర్చ మరో మలుపు తిరిగింది.

''తాగడానికి నీళ్లు ల్యాకపోతే ఈ నాయకులు ఏం సేచ్చాండరు?'' మరొకరి ప్రశ్న.

''నాయకులు వాళ్ల పనులు చూసుకుంటాంటారు'' ఎవరో అన్నారు.

''వాళ్ల పనులు చూసుకోడానికా మనం ఓట్లేసింది? ఓట్లప్పుడు అది సేచ్చం.. ఇది సేచ్చం అని జొల్లు కూతలెందుకు కూయాల'' మరొకరు ఆగ్రహంగా ప్రశ్నించారు.

''కూతలు గాలికీ, సేతలు ఢిల్లీకి. లోగడ భైరేని కొండయ్య అని ఒకాయన నల్లమల కొండన ఆవులు కాసుకుంటాన్నెడంట. ఇట్టనే కరువొచ్చి ఆవులకు నీటిసుక్క దొరకలేదంట. కొండ సేలలో నీటిబుగ్గ పుడితే, తన తలకాయ ఆగతి ఇచ్చానని భైరేనిసోమికి మొక్కున్నాడంట. ఆమైన కొండపేటులోంచి నీటిబుగ్గ ఎగచిమ్మిందంట. ఆవులన్నీ నీళ్లుతాగి పానాలు నిలబెట్టుకున్నాయంట. ఆడిన మాట కోసం కొండయ్య చెట్టెక్కి జుట్టును కొమ్మకు ముడేసుకుని తల నరుక్కున్నాడంట. మూగజీవాలకు నీటికోసం ప్రాణాలిచ్చిన భైరేని కొండయ్య లాంటి త్యాగమూర్తులు ఆ కాలంలో ఉన్నేరు. ఇప్పుడు అట్లాంటి వోళ్లు ఎవరుండారు? ఈ నాయకులు ఏమన్నా భైరేని కొండయ్యలా.. ఏంది'' చెన్నారెడ్డిలో అసహనం రెట్టింపైంది.


అరుగుపై చేరిన వారంతా రాత్రి పొద్దుపొయ్యేదాకా ఆమాటా, ఈమాటా మాట్లాడుకున్నేరు. పనుల కోసం వలస వెళ్లే విషయం ప్రస్తావనకు వచ్చింది. సోమవారం తెల్లవారుజాము బస్సుకు ప్రయాణం కావాలనుకున్నారు. రచ్చబండ ఖాళీ చేసి ఎవరిళ్లకు వాళ్లు వెళ్లిపోయారు.

నాలుగు రోజులు గడిచింది.

ఆగస్టు నెలలో సైతం రోహిణీ కార్తెను తలపిస్తూ ఎండలు ముదికాయి.

సుబ్బిరెడ్డి బోరులో నీళ్లు పూర్తిగా అడుగంటిపోయాయి. బాలసుబ్బయ్య నారు నిలువునా ఎండిపోయింది.

ఆరోజు ఆదివారం. అమావాస్య.



स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत-उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

ఉత్తర చూసి ఎత్తరా గంప అన్నట్లు అయింది ఊళ్లో వాళ్ల పరిస్థితి.

బాలసుబ్బయ్య, చెన్నారెడ్డిలతో పాటు ఊళ్లో చాలామందే వలస వెళ్లేందుకు నిశ్చయించుకున్నారు.

ఊళ్లో చాలామంది వెళ్లేందుకు సిద్ధమయ్యారు.

రాత్రే సామాన్లు సర్దుకున్నారు.

ఆరుబయట పడుకున్న బాలసుబ్బయ్యను ఆలోచనలు అలుముకున్నాయి.

బాలసుబ్బయ్య ఆకాశం వైపునకు చూశాడు.

ఆకాశం మేకతోలు కప్పుకున్నట్టుగా నల్లగా వుంది.

గాలి తోలడం లేదు. ఆకు అల్లాడటం లేదు. ఒకటే ఉక్కపోత.

ఎక్కడో కాసిన్ని చినుకులు పడుతున్నట్టుగా ఉంది, మెల్లగా చల్లగాలి వీచడం మొదలైంది.

బాలసుబ్బయ్య మెల్లగా నిద్రలోకి జారుకున్నాడు.

* * *

వాన మొదలయ్యింది. అట్టాంటిట్లాంటి వాన కాదు, కుండపోత వాన. ముసురు పట్టి కురుస్తోంది. ఒకరోజు... రెండు రోజులు.. మూడు రోజులు గడిచాయి. ముసురుపట్టింది. ఇళ్ల చూర్ల నుండీ దూకే నీళ్లతో వీధులన్నీ జలమయమయ్యాయి. చెరువులు, కుంటలు నిండాయి. వాగులు వంకలు పారుతున్నాయి. రాత్రిళ్లు కప్పల బెకబెకలూ మొదలయ్యాయి. ఆ బెకబెకలు ఊరిగౌనిరాయిలో ప్రతిధ్వనిస్తున్నాయి.

ఊరి జనమంతా వానలో తడుస్తూనే పొలం పనులకు సిద్ధం అవుతున్నారు. పిల్లలు కాగితపు పడవలను వాన నీటిలో వదులుతున్నారు. పదేళ్లుగా ఎండిపోయిన ఊరబావిలో నీళ్లు మొత్తెంను తాకుతున్నాయి. గాలి భోరున వీస్తోంది. వానకు తడుస్తూనే నారుకయ్య వద్దకు చేరుకున్నాడు బాలసుబ్బయ్య. నాలుగు రోజుల వానకే నాటుకు ఎదిగినట్లుగా తయారైంది నారు. తాను కయ్య దగ్గరకు చేరుకోకముందే గురమ్మ నారుకయ్యను దమ్ము చేయించి సిద్ధం చేసి ఉంచింది. వరినాట్లు వేసేందుకు కూలీలు కూడా సిద్ధంగా ఉన్నారు. వానలో వాళ్లు నారు పెరికి సిద్ధం చేస్తున్నారు. బాలసుబ్బయ్య మడిలోకి దిగినారు కట్టలను కయ్యలలో విసురుతున్నాడు.

వాన ఎక్కువైంది. ఉరుములు, మెరుపులూ ఎక్కువైనాయి.

''ఫెళ్లుమని శబ్దం!''

బాలసుబ్బయ్య భయంతో కేకేశాడు. లేచి నడిమంచంలో కూర్చున్నాడు.

పక్కనే పడుకుని ఉన్న గురమ్మ, బాలసుబ్బయ్య కేకకు మేల్కొని భర్తను తట్టి పలుకరించింది.

''నారుకయ్య.. నీళ్లు...'' బాలసుబ్బయ్య తనలో తానే గొణుక్కుంటున్నాడు.

మళ్లీ ఒకసారి ఫెళ్లున శబ్దం!

భయంతో బిక్కుబిక్కుమంటూ చూస్తున్నాడు బాలసుబ్బయ్య.

''అంకిరెడ్డోళ్లు.. వామిదొడ్లోని వేప చెట్లను అమ్మినారులే. చెట్లను కొట్టి రాత్రికి రాత్రే లారీలో మొద్దులు వేసుకుంటాండరు'' ఫెళ్లుమన్న శబ్దానికి కారణం చెప్పింది గురమ్మ.

నిద్రమత్తులో ఉన్న బాలసుబ్బయ్య తనకేమీ అర్థం కానట్టుగా ఆకాశం వైపు వెర్రిచూపులు చూస్తున్నాడు.

ఆకాశం ఏమీ ఎరగనట్టు మరీ నిర్మలంగా వుంది. ఆకాశం చుక్కలు కాస్తున్నాయి. ఆకాశం చుక్కల పళ్లు ఇగిలిస్తూ, మాయదారినవ్వు నవ్వుతున్నట్టుగా వుంది.

''తెల్లవారుతాంది. అందరూ పయానమైతాండరు. లేచి మొకం కడుక్కోపోబ్బా'' భర్తను పురమాయించింది గురమ్మ.

ప్రయాణం గుర్తుకు వచ్చింది బాలసుబ్బయ్యకు.

పిల్లల కోసం అటూ, ఇటూ చూశాడు. ప్రయాణానికి సిద్ధంగా ఉన్నారు పిల్లలిద్దరూ.

